నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శనివారం 29 మార్చి 2025 | SIDDIPET

దుబ్బాక అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి 28: దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధికి సహకరించి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. దుబ్బాక నియోజకవర్గంలో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు వ్యవసాయం పైనే ఆధారపడి ప్రజలు జీవిస్తున్నారని, నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సీఎంను కోరారు. దుబ్బాకలో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలో హబ్షీపూర్ నుంచి దుబ్బాక మీదుగా లచ్చపేట వరకు రోడ్డు విస్తరణ పనులకు రూ.35 కోట్లు కేటాయించాలన్నారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలను సీఎంకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'తో ఫోన్‌లో మాట్లాడుతూ... దుబ్బాక అభివృద్ధిలో భాగంగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. హబ్సీపూర్-లచ్చపేట వరకు రోడ్డు విస్తరణ పనులకు రూ. 35 కోట్లు మంజూరు చేయాలని విన్నవించినట్లు వివరించారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వచ్చేనెలలో వాటికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆహార భద్రతకు ఇక్రిశాట్ పరిశోధనలు

మాట్లాడుతున్న ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ హిమాంశు పాఠక్

- 53 ఏండ్లలో 12 వందల రకాల వంగడాల సృష్టి
- పెరుగుతున్న డ్రైలాండ్‌తో ఆహార పంటలకు విఘాతం
- ఏఐ, టెక్నాలజీ, సైన్స్ సహాయంతో సవాళ్లకు చెక్
- ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ హిమాంశు పాఠక్

పటాన్‌చెరు, మార్చి 28: ఆహార భద్రతకు ఇక్రిశాట్ పరిశోధనలు దోహదం చేస్తున్నాయని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాంశు పాఠక్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన సంస్థ ఇక్రిశాట్ 53వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ హిమాంశు పాఠక్ మాట్లాడుతూ ఇక్రిశాట్ పేద దేశాల్లో ఆహార సంక్షోభ నివారణకు వ్యవసాయంలో విప్లవాత్మక మార్పుల కోసం పరిశోధనలు చేస్తుందన్నారు. 28 మార్చి 1972లో ఇక్రిశాట్ ఏర్పాటైందన్నారు. నిరంతర పరిశోధనలతో ఈ యాభై ఏండ్లలో 12వందల రకాల వంగడాలు కనుక్కొని రైతులకు అందజేశామన్నారు. డ్రైల్యాండ్స్ శరవేగంగా విస్తరిస్తుండటం ఇక్రిశాట్‌కు, ప్రపంచ దేశాలకు సవాల్ విసురుతున్నదన్నారు. వాతావరణ మార్పులు మరోపక్క వ్యవసాయ ఉత్పత్తులను తగ్గిస్తున్నాయన్నారు. ఒక్క డిగ్రీ టెంపరేచర్ పెరిగితే పంట ఉత్పాదకత తగ్గుతుందన్నారు. పేద దేశాల్లో వ్యవసాయంలో మార్పులు రాకపోవడంతో ఆహారధాన్యాల ఉత్పత్తి అనుకున్న స్థాయిలో పెరగడం లేదన్నారు. శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు చేసి తయారు చేసిన నూతన వంగడాలు పేద దేశాల్లోని రైతులకు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. వాతావరణ మార్పులతో భూములు నిస్సారంగా మారుతున్నాయన్నారు. భూముల్లో పోషకాలు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. వర్షాభావ పరిస్థితులతో పేద దేశాలు సతమతమవుతున్నాయన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పండే రకాలు, మిల్లెట్స్, ఇతర ధాన్యాలను రైతులు పండించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రెండేళ్ల క్రితం భారత్ సూచనపై మిల్లెట్స్‌ను ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు మిల్లెట్స్ ఇయర్‌గా ప్రకటించామన్నారు. కొన్ని చోట్ల అతివృష్టి కూడా సమస్యలు సృష్టిస్తున్నదన్నారు. వీటిని అధిగమించేందుకు ఏఐ, టెక్నాలజీ, సైన్స్ సహాయం తీసుకోవాలన్నారు. వ్యవసాయంలో ఆఫ్రికా దేశాలు చాలా వెనకబడి ఉన్నాయని, ఆ దేశాలు పోషకాహార లోపంతోనూ బాధపడుతున్నాయన్నారు. వారికి తమ పరిశోధనలు ఎంతో అండగా నిలుస్తాయన్నారు. భారతదేశం కూడా వ్యవసాయరంగంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. ఇక్రిశాట్ పరిశోధనలు ఇండియా రైతాంగానికి సహాయకంగా ఉన్నాయన్నారు. భారత్‌లోని వ్యవసాయ పరిశోధన సంస్థలతో, ప్రభుత్వాలతో ఇక్రిశాట్ అనేక ప్లాట్‌ఫాంలపై కలిసి పనిచేస్తుందన్నారు. తెలంగాణ రైతులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామన్నారు. నూతనంగా వస్తున్న వ్యవసాయ పరిశోధనలన్నింటినీ ఒకచోటకు తెస్తే అనేక సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయన్నారు. యాభై మూడేండ్ల ఇక్రిశాట్ ప్రయాణంలో ఎన్నో విజయాలు, ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నామన్నారు. భవిష్యత్తు ఆహార సంక్షోభాలకు దీటుగా ఎదుర్కొనేందుకు ఎన్నో నిరంతరం పరిశోధనలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ స్టాన్‌ఫర్డ్ బ్లేడ్, డైరెక్టర్ కమ్యూనికేషన్ రేమండ్ పీచే, శాస్త్రవేత్తలు డాక్టర్ మాంగీలాల్ జాట్, డాక్టర్ సంజయ్ అగర్వాల్, షాన్‌మేజ్ ఉన్నారు.

బతుకుదెరువు కోసం వచ్చి...

- బావిలో పడి ఇద్దరు వలస కార్మికులు మృతి
- ఒడిశా వాసులుగా గుర్తింపు
- సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పైడిగుమ్మల్‌లో ఘటన

బైద్యనాథ్ భత్ర (ఫైల్)

హరసింగ్ మజ్జి (ఫైల్)

కోహీర్, మార్చి 28: ఒడిశాకు చెందిన ఇద్దరు కార్మికులు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందిన ఘటన కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్‌లో చోటుచేసుకొంది. ఎస్సై సతీశ్‌వర్మ వివరాల ప్రకారం... ఒడిశాలోని నబరంగాపూర్ జిల్లా జునపాని గ్రామానికి చెందిన బైద్యనాథ్ భత్ర(26), హరసింగ్ మజ్జి(30) సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ గ్రామానికి పనుల కోసం వచ్చారు. గ్రామ శివారులోని అక్షర అనంత్ ఫార్మ్‌లో కొద్ది రోజుల నుంచి పనిచేస్తున్నారు. తాగుడుకు బానిసలుగా మారడంతో వారు పనిచేసే స్థలానికి సమీపంలోని బావిలో ప్రమాదవశాత్తు పడ్డారు. ఈనెల 10వ తేదీ నుంచి వారిద్దరూ కనిపించలేదు. దీంతో ఫార్మ్ సూపర్‌వైజర్ పంకజ్ తివారీ వారు అదృశ్యమైనట్లు 13వ తేదీన కోహీర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. శుక్రవారం రైతులకు బావిలో నుంచి దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే జేసీబీ, క్రేన్, కార్మికుల సహాయంతో బావిలో నుంచి ఇద్దరి శవాలను వెలికితీశారు. శవాలు పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కోహీర్ ఎస్సై సతీశ్‌వర్మ

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం బస్వాపూర్ శివారులో సాగునీరు లేక ఎండిపోయిన వరి పంట

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం బస్వాపూర్‌లో సాగునీరు లేక ఎండిపోయిన ఉల్లి పంట

నీళ్లులేక రైతుకంట కన్నీళ్లు

సంగారెడ్డి జిల్లాలో సాగునీరు లేక ఎండుతున్న పంటలు

- సింగూరు ప్రాజెక్టు దిగువన అధ్వాన పరిస్థితి
- ప్రాజెక్టులో నీళ్లున్నా పాలాలకు అందని వైనం
- సింగూరు నుంచి సాగునీరు ఇవ్వాలని రైతుల డిమాండ్
- అడుగంటుతున్న భూగర్భ జలాలతో రైతులకు మరిన్ని కష్టాలు
- లక్షలు ఖర్చుపెట్టినా.. చేతికిరాని పంటలు
- కరెంటు కోతలు.. లోవోల్టేజీలతో కాలిపోతున్న మోటర్లు

దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

సాగునీరు లేక రైతు కంట కన్నీళ్లు ఓలుకుతున్నాయి. పచ్చని పైరు కండ్ల ఎదుటే ఎండుతుంటే రైతుల గుండెలు మండుతున్నాయి. ప్రాజెక్టుల్లో నిండుగా నీళ్లున్నా.. పొలాలకు నీళ్లు పారటం లేదు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోరుబావులు నీళ్లు పోయక పంటలు దెబ్బతింటున్నాయి. కరెంటు కోతలు లోవోల్టేజీలతో బోరు మోటర్లు కాలి రైతుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. కేసీఆర్ పాలనలో దిగుబడి, రాబడి కంట చూసిన రైతన్నలు నేడు కాంగ్రెస్ పాలనలో కరువును చవిచూడాల్సి వస్తుంది. సంగారెడ్డి జిల్లాలో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. ప్రాజెక్టుల దిగువన బోరుబావుల కింద ఇదే పరిస్థితి నెలకొంది. సంగారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్‌లో 1.15 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. జిల్లాలోని సింగూరు, నల్లవాగు ప్రాజెక్టుల కింద వరి, జొన్న, కూరగాయల పంటలు సాగు చేశారు. సంగారెడ్డి, అందోలు, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లోని రైతులు బోరుబావుల కింద అత్యధికంగా వరి, నీళ్ల జొన్న పంటలు సాగుచేశారు. 50వేల ఎకరాల్లో రైతులు వరిపంట సాగు చేశారు. సింగూరు ప్రాజెక్టు కింద నీటి పారుదల శాఖ క్రాప్ హాలిడే ప్రకటించినప్పటికీ రైతులు 16వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరి పంట సాగుచేశారు. నల్లవాగు ప్రాజెక్టు, చెరువులు, బోరుబావుల కింద 34వేల ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు. ప్రస్తుతం వరి పంట నీళ్లులేక ఎండిపోతుంది. ముఖ్యంగా సింగూరు, నల్లవాగు ఆయకట్టు, బోరుబావుల కింద సాగునీరు లేక వరి ఎక్కువగా ఎండుతుంది. నల్లవాగు ప్రాజెక్టు కింద 600 ఎకరాలకు సాగునీరు అందక వరి, జొన్న పంట ఎండిపోయే ప్రమాదం ఉంది. భూగర్భ జలాలు అడుగంటడం, కరెంటు కోతలు, లోవోల్టేజీల కారణంగా బోరబావులు నుంచి నీళ్లు అందక వరి పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులకు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

పుల్కల్ మండలం కోడూరులో బోరుమోటర్లు మరమ్మతులు చేయించుకుంటున్న రైతులు

బోరునీటిని బావిలో వేసి పంటలకు ఎత్తిపోస్తున్న ముదిమాణిక్యం రైతు శ్రీను

సంగారెడ్డి మార్చి 28 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో ఎక్కువగా సింగూరు ప్రాజెక్టు దిగువన సాగునీరు లేక పంటలు ఎక్కువగా ఎండుతున్నాయి. ప్రాజెక్టు దిగువన పుల్కల్, చౌటకూరు మండలాల్లో 16వేల ఎకరాలకుపైగా రైతులు వరిపంట సాగుచేశారు. ప్రాజెక్టు నుంచి నీళ్లు వస్తాయని రైతులు ఆశించినప్పటికీ నీటిపారుదల శాఖ క్రాప్ హాలిడే పేరుతో రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. దీంతో రైతులు ఎక్కువగా బోరుబావుల నుంచి నీళ్లు పెట్టుకొని వరి పంటను సాగు చేస్తూ వచ్చారు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటడంతో బోరుబావులు నీళ్లు పోయటం లేదు. దీనికితోడు కరెంటు కోతలు, లోవోల్టేజీ సమస్యలు రైతులను వేధిస్తున్నాయి. ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటలు నిరంతరం కరెంటు సరఫరా చేయటం లేదు. పుల్కల్, చౌటకూరు మండలాల్లో అనధికారికంగా కరెంటు కోతలు అమలు చేస్తున్నారు. రైతుల అందజేసిన వివరాల ప్రకారం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు కరెంటు సరఫరా కావటం లేదు. ఆ తర్వాత కరెంటు సరఫరా అవుతున్నా మధ్యలో కొన్ని గంటల పాటు ఉండటం లేదు. దీంతో వరి పొలాలకు సాగునీరు అందక ఎండిపోతున్నది. లోవోల్టేజీ సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లోవోల్టేజీ సమస్య కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, బోరుమోటర్లు కాలిపోతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క బోరు మోటరు కాలిపోతే రైతు రూ.10వేల వరకు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుంది. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడం, కరెంటు కోతలు, లోవోల్టేజీ సమస్యతో పుల్కల్ మండలంలోని పుల్కల్, బస్వాపూర్, ఇసోజిపేట, గొంగ్లూరు, గంగోజిపేట, చౌటకూరు మండలంలో చౌటకూరు, బొమ్మారెడ్డిగూడెం, ఉప్పరిగూడెం, బద్రిగూడెం, కోర్పోల్, సుల్తాన్‌పూర్‌లో వరి పంటకు సాగునీరు అందక ఎండిపోతున్నాయి. దీంతో రైతులు సింగూరు ప్రాజెక్టు నుంచి పంటకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సింగూరు కాల్వల లైనింగ్ పనుల కోసం క్రాప్ హాలిడే ప్రకటించారు. లైనింగ్ పనులు ఇంకా ప్రారంభం కానందున పంటలను కాపాడేందుకు కాల్వల ద్వారా సింగూరు నీటిని వెంటనే విడుదల చేయాలని పుల్కల్, చౌటకూరు మండలాల రైతులు కోరుతున్నారు. సింగూరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 29.817 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 20.027 టీఎంసీల జలాలు ఉన్నాయి. ప్రాజెక్టులో జలాలు ఉన్న నేపథ్యంలో కాల్వల ద్వారా పొలాలకు నీళ్లు ఇచ్చి అదుకోవాలని రైతులు కోరుతున్నారు. బోరుబావుల కింద వరితోపాటు జొన్న, కూరగాయల పంటలను రైతులు సాగు చేశారు. రైతులు సాగుచేసిన జొన్న, కూరగాయల పంటలకు సైతం సాగునీరు లేక ఎండిపోతున్నాయి. నల్లవాగు కింద సైతం పంటలు ఎండిపోతున్నాయి. నల్లవాగు ప్రాజెక్టు కింద సిర్గాపూర్, కల్హేర్ మండలాల్లో సుమారు 600 ఎకరాల్లో సాగునీరు అందక జొన్న, వరి పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. సాగునీరు ఇచ్చి పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం, అధికారుల్లో చలనం కనిపించటం లేదు. మరో 10 నుంచి 20 రోజుల పాటు సాగునీరు అందకపోతే జిల్లాలో సగానికి పైగా విస్తీర్ణంలో పంట నష్టపోయే అవకాశం ఉంది.

బోరునీటిని బావిలో పోయించి.. పంటలకు ఎత్తిపోస్తున్న రైతులు

పుల్కల్ మండలంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. సింగూరు నుంచి సాగునీరు అందక, బోరుబావుల నుంచి నీళ్లు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. కండ్ల ఎదుట పంటలు ఎండిపోతుండడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న తిప్పలు వర్ణనాతీతం. ఇందుకు ముదిమాణిక్యం గ్రామానికి చెందిన రైతు పడమటి శ్రీనును ఉదాహరణగా చెప్పవచ్చు. పడమటి శ్రీనుకు బస్వాపూర్ శివారులో భూములు ఉన్నాయి. సొంతంగా రెండు ఎకరాల పొలం ఉండగా కౌలుకు మరో ఎనిమిది ఎకరాలు తీసుకున్నాడు. సొంత భూమిలో జొన్న, గోధుమ, ఉల్లిగడ్డ పంటలు సాగు చేశాడు. కౌలుకు తీసుకున్న భూమిలో సైతం జొన్న, గోధుమ పంటలు వేశాడు. రెండు బోర్ల ద్వారా ఎనిమిది ఎకరాల్లో ఉన్న పంటలకు సాగునీరు అందజేస్తున్నాడు. భూగర్భజలాలు తగ్గుముఖం పట్టడంతో బోర్లు నీళ్లు పోయటం తగ్గుముఖం పట్టాయి. దీనికితోడు కరెంటు కోతలు ఇబ్బందికరంగా మారటంతో రైతు శ్రీనుకు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. దీంతో బోరుబావి పక్కనే చిన్న బావి తవ్వి అందులో రెండు బోర్ల నుంచి పైపుల ద్వారా నింపుతున్నాడు. బావి నిండాక మోటరు ద్వారా పొలాలకు నీళ్లు ఎత్తిపోస్తున్నాడు. భూగర్భజలాలు లేకపోవడం, కరెంటు సమస్యలు తనకు ఇబ్బందిగా మారాయని, బావి నుంచి నీళ్లు ఎత్తిపోయకపోతే పంటలు ఎండిపోతున్నాయని శ్రీను ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం సింగూరు ప్రాజెక్టు ద్వారా సాగునీరు ఇచ్చి రైతులను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాడు.

నీళ్లులేక పంట ఎండిపోయింది..

సారూ... నీళ్లులేక పంట ఎండిపోయింది.. ఇప్పుడు ఏమి చేయాలో దిక్కు తోచడం లేదు. నీళ్లు లేక కండ్ల ఎదుటే పంట ఎండిపోతుంటే కండ్లల్లోంచి నీళ్లు వస్తున్నాయి. నాకు ఉన్న 1.50 ఎకరాల భూమిలో అప్పుచేసి మరీ వరి సాగు చేశాను. బోరుబావి కింద వరి సాగు కలిసివస్తుందని అనుకున్నా. ఇప్పుడు బోరు నీళ్లు పోయటం లేదు. నీళ్లు లేక వరిపంట పూర్తిగా ఎండిపోతుంది. పంట పూర్తిగా ఎండిపోతే లక్ష వరకు నష్టం వస్తుంది. ప్రభుత్వం పెద్ద మనస్సు చేసుకుని సింగూరు నుంచి కాల్వల ద్వారా నీళ్లు ఇస్తే నా పంటను బతికించుకుంటా. – పెంటయ్య, రైతు, పుల్కల్

రెండు ఎకరాల్లో..

రెండు ఎకరాల్లో బోరుబావి కింద వరి పంట వేశాను. సాగు కోసం రూ.50వేలకు పైగా ఖర్చు పెట్టాను. ఇప్పుడు బోరుబావిలో నీళ్లు పూర్తిగా ఇంకిపోయాయి. బోరువేస్తే పూర్తిగా నీళ్లు పోయటం లేదు. నీళ్లు లేక వరి పంట పూర్తిగా ఎండిపోతుంది. ప్రభుత్వం సింగూరు కాల్వ నుంచి సాగునీరు ఇచ్చి పంటలను కాపాడాలి. మరో వారం రోజుల్లో కాల్వల ద్వారా సాగునీరు ఇవ్వకపోతే వరి పంట పూర్తిగా ఎండిపోయి నష్టం మిగులుతుంది. ప్రభుత్వం వెంటనే సింగూరు ప్రాజెక్టు ద్వారా పొలాలకు నీళ్లు ఇవ్వాలి. – సొంగ నర్సింహులు, రైతు, పుల్కల్

కేసీఆర్ పాలనలో ఫుల్... కాంగ్రెస్ పాలనలో నిల్

కేసీఆర్ పాలనలో రైతులకు సాగునీళ్లు, కరెంటు ఫుల్‌గా ఉండేవి. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో సాగునీళ్లు, కరెంటు నిల్. కరెంటు కోతలు, లోవోల్టేజీతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లోవోల్టేజీతో మోటర్లు కాలిపోతున్నాయి. దీంతో నీళ్లులేక వరి, కూరగాయల పంటలు ఎండిపోతున్నాయి. లోవోల్టేజీతో మూడు రోజుల క్రితం బోరుమోటరు కాలిపోయింది. ఇప్పుడు పొలానికి నీళ్లు పెట్టలేని పరిస్థితి నెలకొంది. మోటరు మరమ్మతుకు రూ. 9వేలు ఖర్చయింది. ప్రభుత్వం లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి. కోతలు లేకుండా నిరంతరం 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి. – ప్రభాకర్, రైతు, కోడూరు

ఓడీఎఫ్‌తో యుద్ధ ట్యాంకుల తయారీకి ఒప్పందం

కేంద్ర మంత్రిత్వ శాఖతో ఒప్పందం చేసుకుంటున్న ఓడీఎఫ్ సీజీఎం శివశంకర్ ప్రసాద్

కంది, మార్చి 28: సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారం(ఓడీఎఫ్)తో భారీగా యుద్ధ ట్యాంకుల తయారీకి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒప్పందం చేసుకుంది. ఏవీఎన్ఎల్ సంస్థ ఈ యుద్ధ ట్యాంకులను తయారు చేయనున్నది. ఇందులో నాగ్ మిసైల్స్ పేరిట 293 యుద్ధ ట్యాంకులు ఉండగా, నామిస్ పేరుతో కూడిన 13 అత్యాధునిక ట్యాంకుల తయారీకి ఒప్పందాలు జరిగాయి. మెరుగైన ఫైర్ పవర్, ప్రాణాంతకత కోసం ఫైర్ అండ్ ఫర్గాట్ యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థతో శత్రు కవచానికి వ్యతిరేకంగా యుద్ధం చేసేలా వీటిని సిద్ధం చేయనున్నారు. కార్యక్రమంలో కేంద్ర రక్షణ శాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అజయ్‌కుమార్, ఓడీఎఫ్ చీఫ్ జనరల్ మేనేజర్ శివశంకర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అమీన్‌పూర్‌లో దారుణం

అనుమానాస్పద స్థితిలో ముగ్గురు చిన్నారులు మృతి

చిన్నారులు (ఫైల్ ఫొటో)

ఘటనా స్థలంలో గుమిగూడిన ప్రజలు

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ పారితోష్

అమీన్‌పూర్ మార్చి 28: అనుమానాస్పద స్థితిలో ముగ్గురు చిన్నారులు మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా నేలకొండపల్లి మండలం మెడకపల్లికి చెందిన అవురిజింతల చెన్నయ్య 20 ఏండ్ల క్రితం బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని వాటర్ ట్యాంకర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చెన్నయ్యకు 2005లో వివాహం జరగ్గా మొదటి భార్య ప్రమాదవశాత్తు ప్రసవ సమయంలో కిందపడి చనిపోయింది. అనంతరం రజితను రెండో వివాహం చేసుకోగా ఆమెకు ఇద్దరు మగ పిల్లలు సాయికృష్ణ (12) గౌతమ్ (8) ఒక ఆడపిల్ల మధుప్రియ(10) జన్మించారు. వారిద్దరి మధ్య ఎలాంటి గొడవలు గానీ, మనస్పర్థలు గానీ ఉన్నట్లు ఎప్పుడూ చూడలేదని, అన్యోన్యంగా జీవిస్తున్నారని స్థానికులు తెలిపారు. రజిత ఎస్సీ కిడ్స్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుందని, ముగ్గురు పిల్లలు పక్కనే ఉన్న డార్విన్ స్కూల్లో విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. గురువారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో రజిత పిల్లలకు పెరుగన్నం తినిపించి పడుకో పెట్టింది. చెన్నయ్య భోజనం చేసి అనంతరం వాటర్ ట్యాంకర్‌తో చందానగర్‌కు నీటి సరఫరా కోసం వెళ్లి రాత్రి 11గంటలకు తిరిగి వచ్చాడు. ఆ సమయంలో పిల్లలు నిద్రపోతుండగా భార్య రజిత తలుపులు తెరిచింది. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రజితకు తీవ్రమైన కడుపునొప్పి వచ్చి బిగ్గరగా అరిచింది. భార్య అరుపులతో చెన్నయ్య లేచి ఇరుగుపొరుగు వారి సహాయం తో బీరంగూడలోని పనేసియా మెరిడియన్ దవాఖానకు తరలించాడు. ఇంటిలో పడుకున్న పిల్లలు అప్పటికే మృతిచెందినట్లు స్థానికులు గుర్తించారు. తెల్లవారుజామున పిల్లలు విషపదార్థం తినడంతో మృతిచెందినట్లు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. రజిత కూడా విష పదార్థం తిని దవాఖానలో చికిత్స పొందుతుంది. ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్, డీఎస్పీ రవీందర్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఫోరెన్సిక్ విభాగం అధికారులు కూడా పరిశీలించారు. చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. విచారణ నిమిత్తం తల్లిదండ్రులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మగబిడ్డ కోసం మైనర్‌తో పెండ్లి

- విచారణ చేపట్టిన ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీస్ అధికారులు
- బాలికను బాలసదనానికి తరలింపు
- మెదక్ జిల్లా కాట్రియాల గిరిజన తండాలో ఘటన

రామాయంపేట మండలం కాట్రియాల గిరిజన తండాలో విచారణ చేస్తున్న పోలీస్, రెవెన్యూ, ఐసీడీఎస్ అధికారులు

రామాయంపేట, మార్చి 28: మగ సంతానం కోసం ఓ వ్యక్తి మైనర్‌ను పెండ్లి చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీసుల కథనం ప్రకారం... మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గిరిజన తండాకు చెందిన శివలాల్‌కు ముగ్గురు ఆడపిల్లలు జన్మించడంతో మగ సంతానం కోసం పక్కనే మరో గిరిజన తండాకు చెందిన బాలిక(16)ను పెండ్లి చేసుకున్నాడు. బాలికను పెండ్లి చేసుకొని పది రోజులు గడుస్తుండడంతో తండాకు చెందిన కొంతమంది మహిళలు ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మెదక్ నుంచి శిశు సంక్షేమ శాఖ అధికారులతో పాటు రామాయంపేటకు చెందిన వివిధ శాఖల అధికారులు కాట్రియాల గిరిజన తండాకు వెళ్లి విచారణ చేపట్టారు. విచారణలో సంబంధిత వ్యక్తికి ముగ్గురు ఆడ సంతానం ఉండడంతో, మగ సంతానం కోసం మరో అమ్మాయిని పెండ్లి చేసుకున్నట్లు తేలింది. వెంటనే అధికారులు బాలికను మెదక్‌లోని బాలసదనానికి తీసుకెళ్లారు. బాలికను పెండ్లి చేసుకున్న శివలాల్‌పై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, ఆర్ఐ గౌస్ తెలిపారు.